బరితెగింపు

- అక్రమ ర్యాంపు ఏర్పాటు చేసిన అధికార పార్టీ నేత
- నిత్యం తరలిపోతున్న ఇసుక
- ర్యాంప్ ఏర్పాటు నిజమేనని ఒప్పుకున్న తహసీల్దార్
- పహారా పెట్టి, పోలీసులకు ఫిర్యాదు చేశామని వెల్లడి

పెరవలి: 'ప్రభుత్వం మాది–అధికారం మాది, మమ్మల్ని అడ్డుకునేదెవరు, మా జోలికి వచ్చేదెవరు, వైఎస్సార్ సీపీ వాళ్లు అడ్డుకుంటారా దమ్ముంటే అడ్డుకోండి అదే జరిగితే కేసులు పెట్టి లోపలవేస్తాం' అంటూ అధికార పార్టీ నాయకులు బరి తెగించి అక్రమ ర్యాంపు వేశారు. ఇప్పటికే అధికార ర్యాంపుల్లో అక్రమంగా ఇసుక అధికారుల సాక్షిగా తరలిపోతున్నా చర్యలు లేకపోవడంతో అధకారపార్టీ నేతలు ర్యాంపునే స్వచ్ఛందంగా ఏర్పాటుచేసుకుని ఇసుక అక్రమ రవాణాను జోరుగా చేస్తున్నారు. పెరవలి మండలంలో తీపర్రు, కానూరు–పెండ్యాల, కాకరపర్రు ఇసుక ర్యాంపులు ఉన్నా నేడు కొత్తగా ఖండవల్లిలో అనధికార ఇసుక ర్యాంపును మూడు రోజుల క్రితం అధికారపార్టీ ప్రజా ప్రతినిధి ఏర్పాటు చేశారు. అధికారుల సాక్షిగా ఏర్పాటైన ఈ ర్యాంపు నుంచి నిత్యం రాత్రి సమయాల్లో 20 నుంచి 40 ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తున్నారని సమాచారం. తీర ప్రాంతంలోని ప్రతి గ్రామంలో అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవడానికి పగలు పంచాయతీ కార్యదర్శులు, రాత్రుళ్లు రెవెన్యూ సిబ్బంది పహారా కాస్తున్నా వారి పక్క నుంచే ఇసుక తరలి వెళ్లిపోతుందంటే దళారీల నుంచి ఏ స్థాయిలో ముడుపులు అందుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. అక్రమ ఇసుక రవాణాను కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, ఖండవల్లి గ్రామాల్లో జరుగుతున్న తంతు ఎవరైనా ముక్కున వేలేసుకోవలసిందే .గ్రామస్తులు ఈ అక్రమ రవాణాను అడ్డుకోవాలని ప్రయత్నిస్తుంటే కూటమి నేతలు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. దీంతో అధికారులకు ఫిర్యాదు చేయడానికి భయపడే పరిస్థితి. అంతే కాకుండా ప్రస్తుతం ఖండవల్లిలో రీ సర్వే జరుగుతున్న కారణంగా మండలంలోని రెవెన్యూ అధికారులందరూ ఈ గ్రామంలోనే గత 20 రోజులుగా పనిచేస్తున్నారు. కానీ ఇక్కడ ర్యాంప్ ఏర్పాటు చేశారంటే వీరికే తెలియదన్నట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారుల తీరు విస్మయానికి గురిచేస్తోంది. మరోవైపు పోలీసులు మద్యం తాగిస్తే సెల్‌ఫోన్‌లు పట్టుకుని వెళిపోతున్నారే తప్ప ఇక్కడ అక్రమంగా ఇసుక ర్యాంప్ ఏర్పాటు చేసి దర్జాగా



ఖండవల్లిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న గోదావరి తీరం

ఇసుక తరలిస్తున్నా కన్నెత్తి చూడటం లేదంటే అందుకు మామూళ్లు మస్తుగా అందుతున్నాయని, అందుకే వారు ఇటువైపు రావడం లేదని బహిరంగంగా విమర్శిస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఇప్పటివరకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను పట్టుకున్న దాఖలాలు లేవు. ఇలా రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తి పడటం వలన అక్రమ ఇసుక రవాణా 3 ట్రాక్టర్లు 6 లారీలుగా కొనసాగుతున్నది. ప్రజా ప్రతినిధే ఇసుకను తరలించడానికి ర్యాంపును వేశారంటే రెవెన్యూ, పోలీసు అధికారుల సహకారం లేకుండా ఇది సాధ్యమా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ ర్యాంప్ నుంచి ఇసుకను రాత్రి 11 గంటలకు ప్రారంభించి తెల్లవారు జాము 4 గంటల వరకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఆ సమయంలో అధికారులు ఎవరు అటువైపు కన్నెత్తి చూసే పరిస్థితి లేదు. ఈ విషయంపై పెరవలి తహసీల్దార్‌ను వివరణ కోరగా ర్యాంప్ ఏర్పాటు చేయడం నిజమేనని ఎవరు ఏర్పాటు చేశారో తెలియదని, దాని కోసం విచారణ చేస్తున్నామని, పోలీసులకు కూడా లిఖిత పూర్వక ఫిర్యాదు చేశామని, ప్రస్తుతం ఇసుక తరలిపోకుండా వీఆర్‌ఏలను కాపలా పెట్టామని తెలిపారు.



ఖండవల్లి వద్ద గోదావరిలో వేసిన అక్రమ ఇసుక బాట

వైభవంగా ఉమా రామ లింగేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

దేవరపల్లి: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భగా దేవరపల్లిలో పార్వతీ సమేత ఉమా రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి, స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. పార్వతీ దేవిని పెండ్లి కుమార్తెగా, స్వామి వారిని పెండ్లి కొడుకుగా అలంకరించి, శివనామ స్మరణతో అర్చకులు, భక్తులు వివాహ వేదిక పైకి తోడ్కొని వచ్చారు. అనంతరం అర్చకుడు రాంబాబు దంపతులు కల్యాణం నిర్వహించారు. రాత్రి 8 నుంచి 11 గంటల వరకూ కల్యాణ క్రతువు అంగరంగ వైభవంగా జరిగింది. తలంబ్రాలు, పట్టు వస్త్రాలను స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం తరఫున కమిటీ సభ్యులు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, కల్యాణ అక్షతలు అందజేశారు.

క్లుప్తంగా

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా



ప్రక్కిలంకలో ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

తాళ్లపూడి: మండలంలోని ప్రక్కిలంక ఎస్సీ కాలనీలో మంచినీటి బోరు (చేతిపంపు)మరమ్మతులకు గురైంది. గ్రామస్తులు తాగునీటికి ఇబ్బంది పడకుండా పంచాయతీ సర్పంచ్ యాళ్ల స్వప్న ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ యాళ్ల బాబూరావు గత కొద్ది రోజులుగా వాటర్ ట్యాంకర్ ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్యాంకర్ల ద్వారా ప్రజల ఇంటి వద్దకే తాగు నీరు సరఫరా చేస్తున్నట్టు బాబూరావు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ షేక్ సూర్జాన్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా త్వరితగతిన బోరుకు మరమ్మతులు చేయించి ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తామని తెలిపారు.

శిక్షణతో ఉత్తమ ఫలితాలు



అంగన్‌వాడీల శిక్షణలో బోధనోపకరణాలను ప్రదర్శిస్తున్న సిబ్బంది

చాగల్లు: చిన్నారుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు గాను అంగన్‌వాడీ సిబ్బందికి ఇస్తున్న శిక్షణతో ఉత్తమ ఫలితాలు వస్తాయని ఐసీడీఎస్ సీడీపీవో మమ్మి అన్నారు. జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా సోమవారం చాగల్లులో అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల్లో మానసిక వికాసంతో పాటు విద్య పట్ల ఆశక్తిని కలిగించేందుకు శిక్షణ దోహదపడుతుందన్నారు. సిబ్బంది తయారు చేసిన బోధనోపకరణాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంఈవో యు.గురునాథం, సూపర్‌వైజర్లు పి. పద్మావతి, జి.శిరీష తదితరులు పాల్గొన్నారు.

పంటల సర్వేపై సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఉప గణాంక అధికారి సోమరాజు

కొవ్వూరు: వ్యవసాయ గణాంకాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో డేటాను సేకరించి వివరాలను ఆన్‌లైన్ చేయించాలని ఉప గణాంక అధికారి సోమరాజు ఆదేశించారు. జాతీయస్థాయిలో పంటల సర్వేపై సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలోని సహాయ గణాంక అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్‌లో వివరాలు సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. తాళ్లపూడి ఏఎస్‌వో జోడాల్ వెంకట్, నీలిమ, అనిల్, వెంకటేశ్వరరావు, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విశ్వేశ్వరస్వామి కల్యాణం



మల్లవరంలోని విశ్వేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

చాగల్లు, మండలంలోని మల్లవరంలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా అవంతి ఫీడ్స్ జనరల్ మేనేజర్, ఆలయ ధర్మకర్తలు కోర్పు వెంకటరాజు, కైలాసనాగ హైమావతి దంపతులు పీటలపై కూర్చుకుని స్వామివారి కల్యాణం నిర్వహించారు. తొలుత వేదపండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. డాక్టర్ ఆదిత్య విశ్వాస్, డాక్టర్ దీప్తి, అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణం తిలకించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

డివైడర్‌ను ఢీకొన్న వ్యాన్



అనంతపల్లి శివారున డివైడర్‌ను ఢీకొన్న వ్యాన్

నల్లజర్ల: కర్ణాటక రాష్ట్రానికి చెందిన 12 మంది భక్త బృందం ఒక వ్యాన్‌లో వెళ్లి తిరిగి వస్తుండగా వ్యాను సోమవారం తెల్లవారుజామున అనంతపల్లి శివారున బైపాస్ రహదారి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈసంఘటనలో 8 మంది గాయపడగా వారందరినీ చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎవరికి ఎటువంటి ప్రాణపాయం లేదని పోలీసులు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సీఐ విజయశంకరం



ప్రకాశరావుపాలెంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ విజయశంకరం

నల్లజర్ల: పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సైబర్ నేరాలు కొత్తపుంతలు తొక్కుతున్నాయని, వీటిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ విజయశంకరం అన్నారు. సోమవారం ప్రకాశరావుపాలెంలోని వైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలు, డ్రగ్స్, ర్యాగింగ్, సోషల్ మీడియా తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అరవిందకుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి సీఐ విజయశంకరం మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్ల దృష్టిలో పడవద్దని, ఓటీపీ, పిన్, ఇతర వ్యక్తిగత సమాచారం అపరిచిత వ్యక్తులతో పంచుకోవద్దని సూచించారు. వారితో చాటింగ్ ప్రమాదకరమన్నారు. డిజిటల్ అరెస్టులు అంటే భయపడవద్దన్నారు. ఏ సందేహం వచ్చినా సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబరు 1930కి కాల్ చేయాలన్నారు. అరచేతిలోకి వచ్చిన విజ్ఞానంతో పాటు, చెత్త యాప్స్ వచ్చి చేరాయన్నారు. విద్యార్థులు స్వీయ క్రమశిక్షణ పాటించాలన్నారు. డ్రగ్స్ ఊబిలోకి వెళితే జీవితం నాశనమవుతుందని హెచ్చరించారు. హెల్మెట్ ధరించి, రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడపాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై బాలాజీ, పోలీస్ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాల స్వాధీనం



అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్లు

నల్లజర్ల: సరైన పత్రాలు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న 8 టిప్పర్లను బైపాస్ రహదారిపై అనంతపల్లి వద్ద గనుల శాఖ అధికారులు సీజ్ చేసి నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జిల్లా గనులు, భూగర్భజలవనరుల శాఖ అధికారి డి.ఫణి భూషణ్ రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ఎ.ప్రసాద్ సోమవారం ఉదయం వాహనాల సామాజిక తనిఖీలు చేస్తుండుగా కుమారదేవం నుంచి నల్లజర్ల వైపు వస్తున్న అధికలోడు, సరైన పత్రాలు లేని 8 వాహనాలను నిలుపుదల ఆపి తనిఖీ చేస్తుండుగా ఆ లారీ డ్రైవర్లు రహదారి పక్కన ఆపుతున్నట్టే ఆపి పరారయ్యారు. వేరే వారి సాయంతో ఆ వాహనాలను పట్టుకొని నల్లజర్ల పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్టు ఫణిభూషణ్ రెడ్డి తెలిపారు. ఆగి ఉన్న ఒక్కో లారీలో ఎటువంటి పత్రాలు లేని రూ.20 వేలు విలువ చేసే ఇసుక ఉన్నట్టు చెప్పారు. ఈ తనిఖీల్లో సర్వేయర్ శ్రీనివాసులు, కొవ్వూరు ఎంవీఐ శివప్రసాద్ ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- డివిజన్‌లో 24,726 మంది ఓటర్లు
- 37 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

దేవరపల్లి: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలిపారు. కొవ్వూరు డివిజన్‌లోని మూడు నియోజకవర్గాల్లోని తొమ్మిది మండలాల్లో 24,726 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 14,464 మంది, స్త్రీలు 10,262 మంది. డివిజన్‌లో మొత్తం 37 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రామ సచివాలయాలు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు.

పోలింగ్ కేంద్రాల వివరాలు

గోపాలపురం నియోజకవర్గంలో 10, కొవ్వూరు నియోజకవర్గంలో 15, నిడదవోలు నియోజకవర్గంలో 12 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఓట్ల వేటలో నేతలు

పోటీలో ఉన్న అభ్యర్థుల విజయం కోసం నేతలు తీవ్రంగా కృషి చేస్తున్నారు. గ్రామాల్లోని పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ కళాశాలల్లో నాయకులు ప్రచారం చేస్తున్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు. కూటమి అభ్యర్థికి మద్దతుగా మూడు నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది, గ్రామ సచివాలయాల్లో ఓటర్లకు స్లిప్‌లు పంపిణీ చేస్తున్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న పట్టభద్రులను వారి స్వగ్రామాలకు రప్పించడానికి కూటమి నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి శిక్షణను పూర్తి చేశారు.

మండలాలవారీగా ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు

మండలం	ఓటర్లు	పురుషులు	స్త్రీలు
గోపాలపురం	1177	1091	686
దేవరపల్లి	2166	1326	840
నల్లజర్ల	2500	1559	941
చాగల్లు	2618	1525	1093
తాళ్లపూడి	1935	1180	755
కొవ్వూరు	5201	2857	2344
పెరవలి	1926	1107	819
ఉండ్రాజవరం	2651	1578	1073

మహా శివరాత్రికి పటిష్ట బందోబస్తు



గోష్పాద క్షేత్రంలో బందోబస్తుపై పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిషోర్

కొవ్వూరు: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా కొవ్వూరు గోష్పాద క్షేత్రానికి తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ తెలిపారు. గోష్పాద క్షేత్రంలో ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. శివరాత్రి నాడు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రంలో ప్రవేశ మార్గాలు, ట్రాఫిక్ మళ్లింపు, క్యూ ఏర్పాట్లపై ఆరా తీశారు. ప్రధాన స్నాన ఘట్టాల్లో భద్రతా ఏర్పాట్లు, రక్షణ చర్యలపై అడిగి తెలుసుకున్నారు. స్నాన ఘట్టం వద్ద భక్తుల రక్షణ కోసం నదిలో ఏర్పాటు చేసిన పడవలపై పోలీసు సిబ్బందిని నియమించాలని సూచించారు. ప్రధాన ప్రదేశాల నుంచి వాహనాలు క్షేత్రం లోపలకు రాకుండా నియంత్రించాలని సూచించారు. గోష్పాద క్షేత్రానికి వెళ్లే రోడ్డులో భక్తుల రద్దీ ఉండే అవకాశం ఉన్నందున ట్రాఫిక్‌ను మినీ బైపాస్ రోడ్డులో నందమూరు మార్గం నుంచి రైల్వే స్టేషన్ మీదుగా కాటన్ విగ్రహం వరకూ ఇరువైపులా మళ్లించనున్నట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పట్టణ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై కె.జగన్‌మోహన్ రావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



దేవరపల్లిలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

దేవరపల్లి: విద్యా శాఖ ఐదు రోజులుగా స్థానిక అంబటి సత్యనారాయణరావు జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఎం.తిరుమల దాస్ మాట్లాడుతూ, జ్ఞానజ్యోతి రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఉపయోగపడే అంశాలపై గోపాలపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 79 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడేళ్లలో 120 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఏడాదికి 40 రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. 12 రోజులు భౌతికంగా, 28 రోజులు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఐదేళ్ల వయస్సు పూర్తి కాగానే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించే ముందు గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్లు శశికళ, వి.లక్ష్మి, విజయశాంతి, ప్రధానోపాధ్యాయురాలు కె.శ్రీలక్ష్మి, రీసోర్స్ పర్సన్లు మహాలక్ష్మి, శ్రీదేవి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

మద్యం తాగి ఆటో నడిపితే చర్యలు



సదస్సులో మాట్లాడుతున్న సీఐ నాయక్. వేదికపై ఎస్సై సుబ్రహ్మణ్యం

దేవరపల్లి: మద్యం తాగి ఆటోలు నడిపితే డ్రైవర్లపై చట్టపరమైన చర్యలు తప్పవని దేవరపల్లి సీఐ బీఎన్ నాయక్ హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై మండలంలోని ఆటో డ్రైవర్లకు స్థానిక కరుటూరి ఫంక్షన్ హాలులో సోమవారం రాత్రి నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆటో నడిపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఆటో ప్రయాణికులతో సోదరభావంతో మెలగాలని, వాహనాలను కండిషన్‌లో ఉంచుకోవాలని సూచించారు. సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. అతి వేగంగా నడిపి ప్రమాదాలకు గురి కావద్దని చెప్పారు. ఆటో నంబర్‌ను సీరియల్‌గా పెట్టుకోవాలని తెలిపారు. ఆటో డ్రైవర్లకు స్థానిక ఎస్సై వి.సుబ్రహ్మణ్యం పలు సూచనలు చేశారు.

అంగన్‌వాడీ చదువులకు కొత్తరూపు



గ్రాడ్యుయేషన్ డేలో చిన్నారులతో ఏసీడీపీఓ పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు

నల్లజర్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువులు కొత్త రూపు సంతరించుకోనున్నాయని ఐసీడీఎస్ గోపాలపురం ప్రాజెక్ట్ ఏసీడీపీఓ పద్మావతి అన్నారు. నల్లజర్ల జెడ్పీ హైస్కూలులో జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఐదో రోజైన సోమవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మావతి మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాలు ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మారనున్నాయన్నారు. మూడు నుంచి ఐదేళ్ల మధ్య వయస్సు గల చిన్నారులకు ఆటపాటలతో కూడిన చదువులు అందించేలా జ్ఞానజ్యోతి కార్యక్రమం నిర్వహిస్తున్నారని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు విజ్ఞానం పొందడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండాలనే లక్ష్యంతో పోషన్ భీ.. పఢాయీ భీ కార్యక్రమంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని తెలిపారు. ఐదేళ్లు వచ్చే వరకూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకున్న చిన్నారులను గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ ఇచ్చి, ప్రాథమిక పాఠశాలలో చేర్చే ప్రక్రియ చేపట్టామని పద్మావతి చెప్పారు. రీసోర్సు పర్సన్లుగా చిట్టిబాబు, ఎస్‌వీ కృష్ణవేణి, జయలక్ష్మి, ఆర్.నిర్మల, టి.వెంకటలక్ష్మి, ఎం.హారతి వ్యవహరించారు.

వైభవంగా స్వామివార్ల కల్యాణం



గోలింగేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

ఉండ్రాజవరం: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఉండ్రాజవరం గోకర్ణేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి గోకర్ణేశ్వర స్వామికి బాలత్రిపురసుందరీదేవికి వైభవంగా కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి కల్యాణాన్ని తిలకించి స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు మద్దిరాల సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు, విఘ్నేశ్వర పూజ, అంకురార్పణ, దీక్షాధారణ, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈఓ మీసాల వెంకట్రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గోలింగేశ్వరస్వామి దివ్య కల్యాణం

నిడదవోలు: పట్టణ నడిబొడ్డున వేంచేసిన రాజరాజేశ్వరి సహిత గోలింగేశ్వరస్వామి వారి ఆలయ ఆవరణలో సోమవారం రాత్రి శ్రీరాజరాజేశ్వరి సహిత గోలింగేశ్వరస్వామి వారి దివ్యకల్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉదయం 5 గంటల నుంచి స్వామివారికి రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం 3.30 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, మండపారాధనలు నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించడానికి పట్టణ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కల్యాణం అనంతరం స్వామివారి ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఎస్. వెంకటేశ్వరరావు, టీటీడీ వేదపండితుడు మల్లాది సత్యనారాయణశర్మ, తుట్టగుంట రామహనుమత్ శాస్త్రి, ఆలయ ఈవో నామా సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

పాలంగిలో..

ఉండ్రాజవరం: పాలంగిలో వేంచేసిన బాలాత్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వర స్వామి పాంచాహ్నిక కల్యాణ మహోత్సవాలకు ముస్తాబైంది. ఈసందర్భంగా ఆలయ పరిసరాలను దేవస్థానం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈనెల 23 నుంచి 27 వరకు ఉత్సవాలు జరుగుతాయి. దీనిలో భాగంగా 25న ఉదయం ఏకాదశ రుద్రాభిషేకాలు, కుంకుమ పూజలు, సాయత్రం బాలాత్రిపురసుందరి అమ్మవారికి, రామలింగేశ్వరస్వామి వారికి కల్యాణం, రాత్రి 9 గంటలకు స్వామివారి ఊరేగింపు జరుగుతుంది. 26న మహాశివరాత్రి రోజున స్వామివారి దర్శనం, భారీ అన్నసమారాధన జరుగుతుంది. 27న రుద్రాభిషేకం, త్రిశూలస్నానం, పూర్ణాహుతి సాయంత్రం స్వామివారికి శ్రీపుష్పయాగోత్సవం నిర్వహిస్తారని ఆలయ ఈవో ఎంవీ రామయ్య తెలిపారు.

నిమ్మలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

రైతులకు కేవీకే శాస్త్ర వేత్త డాక్టరు రేఖ సూచనలు

నల్లజర్ల: నిమ్మ తోటలలో సూక్ష్మపోషక లోపాలున్నట్టు కేవీకే శాస్త్ర వేత్త డాక్టరు రేఖ రైతులకు సూచించారు. పుల్లలపాడు గ్రామంలో సోమవారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో నిమ్మ, ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు ఇచ్చారు. తోటలలో పూత, పిందె రాలడం రెండు దశలలో జరుగుతుందన్నారు. నీటి వడుదొడుకులు, వాతావరణంలో మార్పులకారణంగా కాయ రాలుతుందన్నారు. చెట్లు పూత, పిందె దశలో ఉన్నప్పుడు చెట్టు మొదలు తవ్వడం, దున్నడం చేయకూడదన్నారు. ఒక మిల్లీలీటరు ప్లానోఫిక్స్ మందును నాలుగైదు లీటర్ల నీటిలో కలిపి లేదా పీపీఎం 2,4 డి. ఒక గ్రాము మందును 100 లీటర్ల నీటిలో కలిపి పూత సమయంలో పిందె గోళీ సైజులో ఉన్నప్పుడు రెండు నెలలకోసారి ముందు పిచికారీ చేయాలన్నారు. ఈవిధంగా సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల మంచి దిగుబడి ఆదాయం పొందవచ్చునన్నారు. ఉద్యానశాఖాధికారి బబిత మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సబ్సిడీ వివరాలు వెల్లడించారు. మార్చి తర్వాత డ్రిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. యంత్ర పరికరాలు, కోతానంతరం పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లూరి సూర్యచంద్రరావు, రైతులు, ఉద్యానశాఖ సహాయకులురూప, విజయ, రామకృష్ణ, డ్రిప్ కంపెనీ సిబ్బంది, సేంద్రియ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.